www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 25 | ఏప్రిల్ | 2026
పేజీలు : 8

## పంటలు వేయడానికి ముందే ధరలు ప్రకటించాలి




**- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ**

**ప్రజాపక్షం/కొత్తగూడెం :** ప్రతీ సీజనల్లో పంటలు వేయడానికి ముందే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు ధరలు ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్‌లో జరుగుతున్న ఏఐకేఎస్ రాష్ట్ర మూడో మహాసభల సందర్భంగా రెండో రోజైన శుక్రవారం జరిగిన కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మిగతా 2లో..

# ఆత్మహత్యలొద్దు.. తెగించి పోరాడుదాం



**- ఆర్టీసి కార్మికులతో తగువు పెట్టుకుంటే పతనం తప్పదు**
**- చట్ట పరమైన సమ్మెపై నిర్భంధాలు ఆపండి**
**- శంకర్ గౌడ్ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి**
**- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎంఎల్‌ఏ కూనంనేని**

**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** సమస్యల పరిష్కారం కోసం విలువైన ప్రాణాలు తీసుకోవద్దని, ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కాదని, తెగించి పోరాడి హక్కులు సాధించుకుందామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ఆర్టీసి కార్మికులు, ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె శుక్రవారానికి మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బస్టాండ్ మిగతా 2లో..

### కార్మికుల డిమాండ్లను నెరవేర్చకుంటే
# ఉద్యమం తప్పదు




**-సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం**

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకుంటే మరొక ఉద్యమం తప్పదని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం జేఏసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికుడు కొలా శంకర్‌గౌడ్ మృతికి నిరసనగా సమ్మెలో మూడవ రోజు నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని బస్‌డిపో నుండి పాతబస్టాండ్ సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాత బస్టాండ్ సెంటర్‌లో మిగతా 2లో..

## రైతును రాజులా చూసుకుంది కెసిఆర్ ప్రభుత్వం




**-కాంగ్రెస్ ప్రభుత్వంలో పండిన పంట కొనే దిక్కులేదు..**
**-వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి**
**-కలెక్టరేట్ ఎదుట బిఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు మహా ధర్నా**
**-పాల్గొన్న మాజీ మంత్రి పువ్వాడ, ఎంపి వద్దిరాజు, ఎంఎల్‌సి తాతా మధు**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రైతును రాజులా చూసుకుంది కేసిఆర్ ప్రభుత్వం మాత్రమేనని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన మొక్కజొన్న, వరి పంటలకు మద్ధతు ధర కల్పించి కొనే దిక్కులేకుండాపోయిందని ఆయన ఆరోపించారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు మహాధర్నా నిర్వహించారు.ఈ ధర్నాలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపి వద్దిరాజు రవిచంద్ర, ఎంఎల్‌సి తాతా మధుసూదన్, మాజీ ఎంఎల్ఎలు మిగతా 2లో..



# ‘మక్క’లిరగ్గొడుతున్నరు!

- మొక్కజొన్న కొనే దిక్కేలేదు
- పండిన పంటలో సగమే కొంటారంట
- దిక్కుతోచని స్థితిలో దిగాలు పడుతున్న రైతన్న
- జిల్లాలో 1.40 లక్షల ఎకరాల్లో మక్క పంట సాగు
- అరకొర కొనుగోలు కేంద్రాలతో కర్షకుల అగచాట్లు
- సగం పంట కొనుగోలుకే రోజుల తరబడి పడిగాపులు

**ప్రజాపక్షం/కొణిజర్ల :** ‘‘మాది ప్రజా పాలన.. కర్షకులకు పెద్ద పీట వేసే రైతు పక్షపాత ప్రభుత్వం.. మా సర్కారులో రైతులే రారాజులు..’’ ఇవి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చెబుతున్న మాటలు. కళ్లకు ఇంపుగా జనం కనిపించిన ప్రతి వేదికపై నుంచి సీఎం వల్లెవేస్తున్న ఊకదంపుడు ప్రసంగాల్లో రొటీన్ పదాలివి. మరి వాస్తవంలోకి చూస్తే తెలంగాణ రాష్ట్రంలో రైతులు రారాజులుగా బతికేదెక్కడ.? కాలానికి ఎదురొడ్డి కాయకష్టం చేసి రైతులు పండించిన పంటను కొనుగోలు చేయలేని ప్రభుత్వం రైతుల పక్షపాత ప్రభుత్వం ఎలా అవుతుంది.? పంటను కొనుగోలు చేయలేని సర్కారు కర్షకులను రాజులుగా ఎలా మార్చగలుగుతుంది..? ఇదే ఇప్పుడు కర్షకులకు కడుపు మంట పుట్టిస్తున్న అంశంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా మిగతా 2లో..

# ఆత్మహత్యలొద్దు.. తెగించి పోరాడుదాం







**(మొదటిపేజీ తరువాయి)**
ఔట్‌గేట్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించి బస్టాండ్ రోడ్‌పై ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో పాల్గొన్న కూనంనేని మాట్లాడుత కార్మికులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వానికైనా పతనం తప్పదని, ఆర్టీసి కార్మికులతో తగువు పెట్టుకోవడం పాలకులు నినాశనానికి నాంది పలికే ప్రమాదం ఉందని, గత ప్రభుత్వం తప్పిదమే ప్రస్తుతం పాలకులు చేస్తున్నారని విమర్శించారు. కార్మిక యూనియన్లు అంటే ప్రభుత్వానికి ఎందుకంత భయమని, హక్కుల కోసం పోరాడే గొంతుకలను నొక్కాలని చూడటం ప్రజాస్వామ్య విరుద్ధం అన్నారు. ప్రజా రవాణా వ్యవస్థను నిర్వీర్యం చేసి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, అందులో భాగంగానే ప్రైవేటీ కరణ దిశగా అడుగులేస్తూ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం,ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేత, గుర్తింపు సంఘం ఎన్నికలు, వేతన సవరణ, పని భద్రత, బకాయిలు, కొత్తబస్సులను కొనుగోలు చేయాలనే తదితర డిమాండ్లు సాధ్యం కానివికాదని పేర్కొన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా మాట్లాడుత చట్ట బద్ధంగా సమ్మె చేస్తుంటే ఆరెస్టులు, అక్రమ నిర్భంధాలు ఎందుకు విధిస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం తన మొండి వైఖరిని వీడకుండా రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పరిస్థితులను తీసుకొస్తోందని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి ఆర్టీసి కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి సమ్మెను నివారించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేరేంత వరకు తాము ఆర్టీసి కార్మికులకు పూర్తి అండగా ఉంటామని, భరోసా ఇచ్చారు. కార్మికుడు శంకర్ గౌడ్ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, తక్షణమే ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నిర్బంధాలు పెరిగే కొద్దీ ఉధ్యమం మరింత ఉధృతం అవుతుందని హెచ్చరిచారు. అనంతరం పలువురు ఆర్టీసి మహిళా కార్మికులు మృతి చెందిన శంకర్ గౌడ్ చిత్రపటంతో ర్యాలీ నిర్వహిచారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, సలిగంటి శ్రీనివాస్, మిర్యాల రంగయ్య, ఎస్‌కే ఫహీమ్, జిల్లా సమితి సభ్యులు వంగ వెంకట్, కె రత్నకుమారి, నేరెళ్ల రమేష్, భూక్యా శ్రీనివాస్, రమణమూర్తి, నాయకులు ఎర్రవెల్లి శంకర్, గుమ్మడెల్లి దుర్గయ్య, నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, యూసుఫ్, సత్యనారాయణ చారి, షాహీన్ సైసర్, మేదిని లక్ష్మి , షమీమ్, వీణ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల డిమాండ్లను నెరవేర్చకుంటే ఉద్యమం తప్పదు



**(మొదటిపేజీ తరువాయి)**
మానవహారం చేపట్టి రెండు నిమిషాలు పాటు మౌనం పాటించి శంకర్‌గౌడ్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు ఇప్పటికీ ఇప్పుడే అనుకొని సమ్మె నోటీస్ ఇవ్వలేదని 41 రోజుల క్రితమే సమ్మె నోటిసు ఇచ్చారన్నారు. సమ్మె ప్రారంభానికి ముందు కార్మికుల సంఘాలతో చర్చలు జరిపిన మంత్రులు మరో నాలుగు వారాలు సమయం కావాలని కోరడం సమజసం కాదన్నారు. మీరు పెట్టిన డిమాండ్స్ కొత్తవేమి కాదని, గత మూడు సంవత్సరాల నుండి యాజమాన్యం, కార్మికులు, ప్రజల మధ్య నలుగుతున్న డిమాండ్లేనన్నారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా దొంగ దారిన బస్సులను నడపాలని చూసినప్పుడు కొంతమంది కార్మికులు నిస్సహాయత గురై ఆత్మహత్యయత్నానికి పాల్పడారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు ఎవరు నిరాశకు గురి కావద్దని, పోరాడి సాధించుకోవాలని ఆత్మహత్యలు పరిష్కారం కాదని అన్నారు. గతంలో 56 రోజుల పాటు జరిగిన సమ్మెలో మొదటి రోజు నుండి చివరి వరకు సిపిఐ కీలక పాత్ర పోషించిదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఏడు రోజుల పాటు అమరణ నిరహర దీక్ష చేసి సమస్యకు పరిష్కారం చూపారన్నారు. ఈ సమ్మెలో కూడా సిపిఐ మద్దతు ఉంటుందని, కార్మికులకు ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాదె లక్ష్మి నారాయణ, తోట రామాంజనేయులు, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, పగడాల మల్లేష్, పిడిఎస్‌యూ జిల్లా నాయకులు మస్తాన్, జేఏసీ ఛైర్మన్ పిల్లి రమేష్, కన్వీనర్లు బిఎస్ రెడ్డి, ఎన్ నాగయ్య, ఎంఆర్‌నాథ్, ఎల్‌ఆర్‌కె రావు, పిట్టల సుధాకర్, నాయకులు అనిత, బేతంపూడి బుచ్చిబాబు, రామలక్ష్మి , సుజాత, మాధవరావు, రోషయ్య తదితరులు పాల్గొన్నారు.

# పంటలు వేయడానికి ముందే ధరలు ప్రకటించాలి

**(మొదటిపేజీ తరువాయి)** సమగ్ర పంటల విధానాన్ని ప్రవేశపెట్టాలన్నారు. వరి,మొక్కజొన్న, పత్తి పంటలే కాకుండా ఇతర పంటలకు కూడా మద్దతు ధరలు, బోనస్‌లు ప్రకటించాలని ఈ సందర్భంగా ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కర్నాటక తరహాలో ధరల నిర్ణయ కమిటీలు ఏర్పాటు చేసి ముందుగానే మద్దతు ధరలు ప్రకటించడం మంచిదన్నారు. విత్తన బ్యాంకుల ద్వారానే నాణ్యమైన విత్తనం సాధ్యమని చెప్పారు. విత్తన వ్యాపార సంస్థలు లాభసాటి విత్తనాల గురించి ప్రచారం చేస్తాయని అందుకే ప్రైవేటు విత్తన కంపెనీల మోసాలకు గురికావద్దని రైతుల కు సూచించారు. గతంలో అన్ని పంటలను సీజనల్లో పండించిన వారసత్వం ఉందని, ఇప్పుడు కూడా రైతులు ఆ దిశగా నడిచేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కేరళా ప్రభుత్వం 16 పంటలకు 22 శాతం మద్దతు ధర ప్రకటించడం వల్ల ఆ రాష్ట్రంలో రైతులు సుభిక్షంగా ఉన్నారని, ఆ తరహాలో తెలంగాణ ప్రభుత్వం కూడా రైతు సంక్షేమానికి పాటుపడాలని చెప్పారు. గత బడ్జెట్‌తో పోలీస్తే ఈ సారి వ్యవసాయానికి రూ.1260 కోట్ల మేరా నిధుల కోత పెట్టడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. అదే సమయంలో 1.4 శాత వ్యవసాయ ఆదాయం పెరిగిందని చెప్పారు. ఆదాయం పెరిగినప్పుడు బడ్జెట్లో కోత పెట్టాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. వేసవి సమీపిస్తుండగానే భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పదం దేశ ప్రయోజాలనకు తీవ్ర ప్రమాదకరంగా ఉందని, ఆ ఒప్పందం రద్దయ్యేంత వరరకు పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

# 'మక్క'లిరగ్గొడుతున్నరు!




**(మొదటిపేజీ తరువాయి)**
మక్కల కొనుగోళ్లలో సర్కారు వెనక్కు తగ్గడం హాట్ టాపిక్‌గా మారింది. రైతులు పండించిన పంటలో సగమే కొంటామని ఏకంగా ప్రభుత్వమే ప్రకటన చేయడం విడ్డూరంగా కనిపిస్తోంది. ఈ అంశంపై ప్రతిపక్షాలు సైతం సర్కారుపై గుర్రుగా ఉన్నాయి. నెత్తుటిని చెమటగా మార్చి రైతులు పండించిన పంటను కొనే దిక్కలేని దిక్కుమాలిన ముఖ్యమంత్రి దిగిపోవాలని కాంగ్రెస్సేతర పార్టీలన్నీ దుమ్మెత్తిపోస్తున్నాయి. మక్కల కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటనతో జిల్లాలో రైతుల గుండెల్లో రాయి పడింది. ఇటీవల జిల్లా రైతాంగం మొక్కజొన్నను ప్రధాన వాణిజ్య పంటగా మార్చుకున్నారు. గతంలో పత్తి, మిర్చి వేసే రైతులు సైతం మొక్కజొన్న పంటపై ఆసక్తి చూపుతూ ఈసారి మక్కల సాగుకు మొగ్గు చూపారు. జిల్లా వ్యాప్తంగా ఒక లక్షా 40 వేల ఎకరాల విస్తీర్ణంలో రైతులు మొక్కజొన్నను సాగు చేశారు. ఈసారి మునుపెన్నడూ లేనివిధంగా జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న కొణిజర్ల మండలంలో 22 వేల ఎకరాల్లో మక్కలను సాగు చేశారు. దీంతో జిల్లాలో దిగుబడి బాగా పెరిగింది. ఎకరాకు సుమారు 40 నుంచి 45 క్వింటాళ్ల వరకు పంట దిగబడి రావడంతో రైతులు తమ కష్టాలు తీరుతాయన్న ఆశాభావంతో ఉన్నారు.

### మొక్క రైతుల నెత్తిన సర్కారు పిడుగు..

బాగా దిగుబడి రావడంతో పంటను అమ్మి అప్పులు తీర్చుకోవాలనుకున్న రైతుల నెత్తిన సర్కారు పిడుగు వేసింది. ఎకరాకు కేవలం 26 క్వింటాళ్లను మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ప్రకటించడంతో రైతులు ఏం చేయాలో దిక్కుతోచక డీలా పడ్డారు. వాస్తవానికి ఎకరాకు 40 నుంచి 45 క్వింటాళ్ల దిగుబడి రావడంతో మిగిలిన పంటను ఎక్కడ, ఎలా అమ్ముకోవాలన్న మీమాంశలో రైతులు ఉండిపోయారు. గిట్టుబాటు ధర కాస్త అటు ఇటుగా అయినా రైతులు పండించిన పంట మొత్తాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయడం ప్రభుత్వ బాధ్యత. అలాంటిది పండించిన పంటలో సగమే కొనుగోలు చేస్తామని ఏకంగా ప్రభుత్వమే బాహాటంగా ప్రకటన చేయడం విడ్డూరంగా ఉందని ప్రతిపక్షాలు దుమ్మెత్తిపోస్తున్నాయి. గతంలో ఏ ప్రభుత్వం ఇలాంటి ప్రకటన చేయలేదని, ఇది రైతుల నడ్డి విరిచే చర్య అని విమర్శిస్తున్నాయి.



### అరకొర కేంద్రాలు.. చాలీ చాలని గన్నీ బ్యాగులు..

నెత్తుటిని చెమటగా మార్చి ఆరుగాలం శ్రమించిన రైతుల శ్రమను అపహాస్యం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే పకడ్బందీ వ్యూహంతో ప్రణాళిక సిద్ధం చేసుకుంది. ఈక్రమంలో మక్కల కొనుగోళ్లకు అరకొరగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ముప్పతిప్పలు పెడుతోంది. జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న కొణిజర్ల మండలంలో 22 వేల ఎకరాల్లో రైతులు మొక్కజొన్నలను సాగు చేశారు. ఒక్కో ఒకరాకు తక్కువలో తక్కువ 40 క్వింటాళ్ల సాగు వచ్చినా మండల వ్యాప్తంగా 9 లక్షల క్వింటాళ్ల మొక్కజొన్నలు పండుతాయి. అయితే ఈ పంట కొనుగోళ్ల కోసం 27 గ్రామ పంచాయతీల్లోని 56 కుగ్రామాలకు 15 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కాగా కేవలం ఆరు కేంద్రాలను మాత్రమే ఏర్పాటు చేసి రైతులపై ఈ ప్రభుత్వం దాష్టీకాన్ని ప్రదర్శించింది. అరకొర కేంద్రాల ఏర్పాటు ఫలితంగా రైతులు తమ పంటను విక్రయించేందుకు కేంద్రాల దగ్గర రోజు తరబడి పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. మూలిగే నక్కపై తాటి కాయ పడిన చందంగా మరోపక్క పంటను కొనుగోలు కేంద్రాలకు చేర్చే లారీల కొరత కూడా రైతులను వేధిస్తోంది. ఈ కారణంగా రైతులు బస్తాకు రూ.15 చొప్పుల లారీ యజమానులకు అదనంగా చెల్లించాల్సి దుస్థితి ఏర్పడుతోంది. ఈ సమస్యలకు తోడు గన్నీ బ్యాగుల కొరత కూడా రైతుల నెత్తిన మరో మొట్టికాయ వేస్తోంది. వాస్తవానికి గన్నీ బ్యాగులు రైతులకు ప్రభుత్వమే ఉచితంగా ఇవ్వాల్సి ఉంది. అయితే ఈ బ్యాగులు కూడా అరకొరగానే రావడంతో వీటి కోసం కూడా రైతులు తిప్పలు పడాల్సి వస్తోంది. దీంతో రైతులు ఈ బ్యాగులను రూ.25 చొప్పున కొనుగోలు చేస్తుండగా ప్రభుత్వం మాత్రం ఒక్కో బ్యాగుకు రూ.13 మాత్రమే చెల్లిస్తోంది. ఈరకంగా కూడా రైతులు నష్టపోవాల్సి వస్తోంది. మొత్తంమ్మీద మొక్కజొన్నల కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కర్షకుల గుండెల్లో మంట రగిలిస్తుండగా ప్రతిపక్షాలు సైతం భగ్గుమంటున్నాయి.

# రైతును రాజులా చూసుకుంది కెసిఆర్ ప్రభుత్వం

**(మొదటిపేజీ తరువాయి)**



సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ధర్నాను ఉద్దేశించి మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ , ఎంపి వద్దిరాజు రవిచంద్ర, ఎంఎల్‌సి తాతా మధుసూదన్ లు మాట్లాడుతూ పదేళ్ల కేసిఆర్ పాలనలో ఏ ఒక్క రైతు ఇబ్బందులు పడలేదని యూరియా కోసం తిప్పలు పడలేదన్నారు. కరోనా వంటి సమయంలో కూడా రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రైతులకు కష్టాలు ఎదురయ్యాయన్నారు. యూరియా కోసం తిప్పలు పడ్డారని షాపుల్లో లేని యూరియా యాప్‌లో ఎలా వస్తుందని ప్రశ్నించారు. కరెంటు ఎప్పుడు వస్తుందో పోతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. కేసిఆర్ హయాంలో రైతులకు స్వర్ణయుగంలా గడిచిందన్నారు. రైతుబంధు పది రోజుల్లో అందరి ఖాతాల్లో వేసిన ఘనత బిఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. రైతుభరోసా, రైతుభీమా వంటి పథకాలను అమలు చేసిందన్నారు. కాంగ్రెస్ రైతుభరోసా నిధులు ఎకరానికి ఆరువేలు మొదటి దఫా, రెండవ దఫా అంటూ కాలయాపన చేస్తుందన్నారు. ఆరుగాలం కష్టపడి రైతులు పండించిన పంటను కొనేందుకు దిక్కులేదన్నారు. కొనుగోలు కేంద్రాలు లేక రైతులు దళారులను నమ్మి మోసపోతున్నారన్నారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా కూడా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మొక్కజొన్న పంటను కొనుగోలు చేయడంతో పాటు వరి ధాన్యానికి మద్దతు ధర కల్పించి కొనుగోలు చేయాలన్నారు. లేని పక్షంలో రైతులతో కలిసి ఉద్యమిస్తామన్నారు. ధర్నా అనంతరం బిఆర్‌ఎస్ శ్రేణులు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. అనంతరం అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పి ఛైర్మన్ లింగాల కమల్‌రాజ్, డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, నాయకులు ఆర్‌జెసి కృష్ణ, బచ్చు విజయ్‌కుమార్, పగడాల నాగరాజు, అజ్మీర వీరునాయక్, నాయకులు బొమ్మెర రామ్మూర్తి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల గురించి మాట్లాడే అర్హత బిఆర్ఎస్‌కు లేదు..

**-ఆర్టిసి కార్మికులు సమయమనం పాటించాలి**
**-విలేకరుల సమావేశంలో రాయల, నూతి**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రైతుల గురించి మాట్లాడే అర్హత బిఆర్ఎస్ పార్టీకి లేదని, ఆర్టిసి కార్మికులు సమయమనం పాటించాలని ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారయణ గౌడ్ తెలిపారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవ రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాయల నాగేశ్వరరావు, నూతి సత్యనారాయణ గౌడ్ లు మాట్లాడుతూ ఒకప్పుడు అనేక ఆర్థిక పరిపాలన ఇబ్బందులు ఎదుర్కొన్న టిజి ఎస్ ఆర్టిసి ఇప్పుడు ప్రభుత్వ సహకారంతో, కార్మికులు అంకితభావం కష్టపడే నైజం వల్ల ఒక బలమైన రవాణా వ్యవస్థగా ఎదిగిందన్నారు. ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదని ఆర్టిసి కార్మికులు సమయమనం పాటించాలని తెలిపారు. శంకర్ గౌడ్ మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 50 రోజులకు పైగా జరిగిన సమ్మెకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్ధతు నిచ్చిందని ఇప్పుడు కూడా ఆర్టిసి కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఛైర్మన్‌గా కమిటీ వేసి పరిష్కార మార్గాలు చేపడుతుందన్నారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి ఆర్టిసి సంస్థ పరిరక్షణకు కృషి చేస్తుందన్నారు. రైతుల పక్షాన మాట్లాడే అర్హత బిఆర్ఎస్‌కు లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఎప్పుడు పండనంత విధంగా గతేడాది, ఈ ఏడాది వరి, మొక్కజొన్న పండిందని రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. ప్రభుత్వం అన్ని విధాలుగా రైతులు పండించిన పంటలకు మద్ధతు ధరనిచ్చి కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. బిఆర్ఎస్ ముసలి కన్నీరు కార్చి సానుభూతి తెలపాల్సిన అవసరం లేదన్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి లు వరి, మొక్కజొన్న కొనుగోళ్లకు సంబంధించి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. కాలువ కట్టపై పేదలు వేసుకున్న గుడిసెలను ఖాళీ చేయించి అట్టి భూములను ఆక్రమించుకున్న ఘనత పువ్వాడ అజయ్‌కుమార్‌దని అటువంటి వ్యక్తి దశాబ్దాల కాలంగా మచ్చలేని నాయకుడైన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి లను విమర్శించడం శోచనీయమన్నారు. ప్రజలంతా గమనిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పిసిసి సభ్యులు పుచ్చకాయల వీరభద్రం, మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, బాల గంగాధర్ తిలక్, బానాల లక్ష్మణ్, పాలకుర్తి నాగేశ్వరరావు, ముజాహిద్ హుస్సేన్, కలవకుంట్ల గోపాల్, రంగరాజు, రవి, ఏలూరి శ్రీనివాస్, నర్సింహారావు, నారాయణ పాల్గొన్నారు.

# బిఎస్ఎన్ఎల్ సేవలు మెరుగుపర్చాలి

**-టిఏసి సమావేశంలో సభ్యులు**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో బిఎస్ఎన్ఎల్ సిగ్నల్ సమస్యలను తక్షణమే పరిష్కరించి వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ (టిఏసి) సభ్యులు బిఎస్ఎన్ఎల్ అధికారులను కోరారు. శుక్రవారం ఖమ్మంలోని ఎంపి క్యాంపు కార్యాలయంలో టిఏసి సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న నెట్‌వర్క్ ఇబ్బందులపై కమిటీ సభ్యులు అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, హిమామ్‌బాయ్, రంజిత్ నాయక్, మచ్చా రామారావు, సత్యనారాయణ రెడ్డి తదితరులు పలు కీలక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కూసుమంచి ప్రాంతంలో ఇంటర్ నెట్ సేవలు అత్యంత పేలవంగా ఉన్నాయని ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలన్నారు. వినియోగదారుల కోసం బిఎస్ఎన్ఎల్ ఖమ్మం కార్యాలయంలో సిమ్ కార్డులను నిరంతరం అందుబాటులో ఉంచాలని కోరారు. బోనకల్, చింతకాని మండలాల్లో నెట్‌వర్క్ పరిధిని విస్తరించేందుకు నూతన టవర్లను ఏర్పాటు చేయాలన్నారు. గోవిందాపురం, వైరా, బ్రాహ్మణపల్లి, ఉప్పలమడక గ్రామాల్లో సిగ్నల్ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఖమ్మం రూరల్ మండలం కస్నాతండా, ఖమ్మం నగరంలోని ఇందిరా నగర్, గోశాల ప్రాంతాల్లో మెరుగైన సిగ్నల్ కోసం నూతన టవర్లను ఏర్పాటు చేయాలని సమావేశం తీర్మానించింది. టిఏసి సభ్యుల విజ్ఞప్తి మేరకై డిజిఎం రాజశేఖర్, ఏజిఎం లు స్పందిస్తూ సమస్య తీవ్రతను బట్టి ప్రాధాన్యత క్రమంలో అవసరమైన చోట కొత్త టవర్లను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి సూచనల మేరకు పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించి సిగ్నల్, ఇంటర్‌నెట్ సేవలకు ఆటంకం కలుగకుండా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ఆర్‌టిసి డ్రైవర్ మృతికి నిరసనగా సిపిఐ మౌన ప్రదర్శన

**-మౌన ర్యాలీలో సొమ్మసిల్లి పడిపోయిన కండక్టర్**
**-అంబులెన్స్‌ను ఢీకొట్టిన బస్సు**



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** టీజీ ఆర్టీసీ కార్మికుల సమ్మె గురువారం మూడో రోజుకు చేరింది. విలీన హామీ అమలులో ప్రభుత్వ జాప్యాన్ని నిరసిస్తూ ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ శంకర్ గౌడ్ మృతికి సంతాపంగా సీపీఐ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు పట్టణంలో మౌన ప్రదర్శన నిర్వహించారు. ఈ ర్యాలీలో మహిళా కండక్టర్ సొమ్మసిల్లి పడిపోవడంతో కార్మికులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామీ ఇచ్చి 30 నెలలు గడిచినా అమలు చేయకుండా కార్మికులను మోసం చేస్తున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ, ఏఐటీయూసీ నాయకులు నిమ్మటూరి రామకృష్ణ ప్రభుత్వంపై తీవ్రంగా ధ్వజమెత్తారు. ఫ్రీ బస్ పథకాన్ని విజయవంతం చేసిన ఆర్టీసీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిగణలోకి తీసుకోకపోవడం హాస్యాస్పదమని దండు ఆదినారాయణ విమర్శించారు. మహాలక్ష్మి టికెట్ డబ్బులు, బస్సు పాస్ రాయితీల సొమ్ము నెలకు 400 కోట్లు ప్రభుత్వం బకాయి పడిందని, సీసీఎస్, పీఎఫ్ డబ్బులు వాడుకుని తిరిగి చెల్లించకుండా కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**అంబులెన్స్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు...**

ఇదిలా ఉండగా, గురువారం విధులకు హాజరైన ఓ ప్రైవేట్ డ్రైవర్ బస్టాండ్‌లో బస్సును రివర్స్ చేస్తూ ఆగి ఉన్న అంబులెన్స్‌ను ఢీకొట్టాడు. దీంతో బస్టాండ్ ఆవరణలో ఒక్కసారిగా అలజడి మొదలైంది. పెద్ద ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు, కార్మికులు ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవింగ్ రాని వారికి బస్సులు ఇవ్వడం వల్ల ప్రమాదాలు జరిగే





అవకాశం ఉందని ప్రజలు, ప్రతిపక్షాలు మొత్తుకుంటున్నాయని, ఇదే ప్రమాదం రోడ్డుపై జరిగి ఉంటే ప్రాణ నష్టం తీవ్రంగా ఉండేదని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. అనుభవం లేని డ్రైవర్లకు బస్సులు అప్పగిస్తే అమాయకుల ప్రాణాలు గాల్లో కలుస్తాయని, తక్షణమే ప్రభుత్వం కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి ప్రజలకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు తడికమళ్ళ యోబు, పిడిఎస్‌యూ నాయకులు శరత్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జాజిరి శ్రీనివాస్, జేఏసీ చైర్మన్ జి మల్లికార్జున్,వైస్ చైర్మన్ రాంబాబు, కన్వీనర్ కేఎస్ రావు, కో కన్వీనర్లు సతీష్, రాఘవులు, దొరబాబు, కమిటీ సభ్యులుడి కృష్ణ, జిఎంకే రావు, ముత్తయ్య, భూషణం, జానకి, ఫుడ్ కమిటీ సభ్యులు ఎన్ ఎన్ కుమార్, ఎస్ ఎస్ రావు, ఎన్బిపి రావు, డి యాదగిరి, టిఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లబ్దిదారులకు మంజూరైన చెక్కులను రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పంపిణీ చేశారు. శుక్రవారం ఖమ్మం బుర్హాన్‌పురంలోని తన క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తన సిఫారసు మేరకు 19 మంది లబ్దిదారులకు మంజూరైన రూ. 8.50 లక్షల విలువ గల చెక్కులను ఎంపి వద్దిరాజు రవిచంద్ర పంపిణీ చేశారు. మరో ఇద్దరికి ముందస్తు ఆపరేషన్ నిమిత్తం మంజూరైన నాలుగు లక్షల విలువైన ఎల్‌వోసి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పలు అనారోగ్య కారణాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొంది కోలుకున్న బాధితులను పరామర్శించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ లింగాల కమల్‌రాజ్, మధిర మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, మధిర మున్సిపల్ కౌన్సిలర్లు వెన్నంశెట్టి అప్పారావు, మధిర బిఆర్ఎస్ కార్యదర్శి అరిగె శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ యాసా రామారావు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లేడిబోయిన గోపాలరావు, నాయకులు పాల్గొన్నారు.

# ఎన్యుమరేటర్స్‌కి ట్రైనింగ్ ప్రోగ్రాం




**ప్రజాపక్షం/కొణిజర్ల :** జనగణన 2027లో భాగంగా కొణిజర్లలో ఎన్యుమరేటర్స్, సూపర్‌వైజర్లకు ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కొణిజర్ల తహశీల్దార్ ఎన్ అరుణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈట్రైనింగ్ రెండు బ్యాచ్‌లకు మూడు రోజుల చొప్పున మొత్తం 6 రోజుల పాటు ట్రైనింగ్ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ ఎన్ తిరపతిరావు, ఫీల్డ్ ట్రైనర్స్ రమేష్, అరుణాకర్‌రావు, గిర్థావర్‌లు రమేష్, నరేష్‌లు పాల్గొన్నారు.

# ప్రైవేట్ స్కూల్ సమస్యలు పరిష్కారానికి కృషిచేస్తా



**ప్రజాపక్షం/కొణిజర్ల :** ప్రయివేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలంగాణ రికగ్నైజడ్ ప్రయివేట్ పాఠశాలల అసోషియేషన్ వైస్ ప్రెసిడెంట్ కొణిజర్ల సూపర్ జెమ్స్ పాఠశాల ప్రిన్సిపాల్ కొణతం ఉమా శంకర్ అన్నారు. శుక్రవారం ఖమ్మం నగరంలో విద్యారణ్య పాఠశాలలో పాఠశాలలో జరిగిన ఖమ్మం జిల్లా ప్రయివేట్ స్కూల్స్ కార్యవర్గ సమావేశం జరిగింది. తనను జిల్లా వైస్ ప్రెసిడెంట్ గా రెండోసారి ఎంపికచేయడంపట్ల రాష్ట్ర, జిల్లా అన్ని డివిజన్ మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

# జనగణనను పకడ్బందీగా నిర్వహించాలి



**ప్రజాపక్షం/బోనకల్ :** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జనగణనను పకడ్బందీగా నిర్వహించాలని బోనకల్ తహశీల్దార్ రమాదేవి తెలిపారు. శుక్రవారం ముదిగొండ రైతు వేదికలో ఏర్పాటు చేసిన జనగణన సిబ్బంది శిక్షణా కార్యక్రమంలో సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈశిక్షణా కార్యక్రమంలో ఫీల్డ్ ట్రైనర్ టి.రత్నకుమార్, విశ్వనాథం, ఎఎస్ఓ కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మధిర ఆర్టిసి కార్మికుల నిరసన ర్యాలీ




**ప్రజాపక్షం/మధిర :** తెలంగాణలో ఆర్టిసి డ్రైవర్ శంకర్‌గౌడ్ మృతి పట్ల నిరసనలు మిన్నంటాయి. వరంగల్ జిల్లా నర్సంపేట డిపోకు చెందిన శంకర్‌గౌడ్ సమ్మెలో భాగంగా తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసుకోగా చికిత్స పొందుతూ మృతి చెందారు. శంకర్‌గౌడ్ మృతితో మధిర ఆర్టిసి కార్మికులు, జెఏసి నేతలు ఆందోళన తీవ్రతరం చేశారు. శుక్రవారం ఆర్టిసి డిపో నుంచి కార్మికులు, జేఏసి నేతలు భారీ ర్యాలీగా ఆర్‌వి కాంప్లెక్స్ చేరుకుని అఖిలపక్ష నాయకులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆర్టిసి ప్రభుత్వంలో విలీనం చేయాలని, వేతన సవరణ, పిఆర్‌సి పెండింగ్ బకాయిలను చెల్లించాలన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆర్టిసి కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనా కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు, జెఏసీ నేతలు, ఆర్టిసి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** రైతు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య వ్యవసాయాధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎర్రుపాలెం మండలంలోని కాచారం, ఎర్రుపాలెం గ్రామాలను సందర్శించి రైతులకు సలహాలు, సూచనలిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పలు పథకాలు పొందాలన్న, రాబోయే వానాకాలంలో యూరియా బుక్ చేసుకోవాలన్న ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో 11 అంకెల రైతు గుర్తింపు సంఖ్య తప్పనసరి అని తెలిపారు. ఎర్రుపాలెం మండలంలో మొత్తం 16972 రైతులకు గాను 14350 మంది నమోదు చేసుకోవడం జరిగిందని, మిగిలిన 2622 రైతులందరూ మీ దగ్గరలో గల మీసేవ కేంద్రంలో గాని, వ్యవసాయ విస్తరణాధికారిని సంప్రదించి త్వరితగతిన నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బోయినపల్లి సాయిశివ, ఎఇఓ బాలకృష్ణ, వంశీ, రైతులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం మొండివైఖరి విడనాడాలి

**-ఆర్టీసీ ఉద్యోగుల డిమాండ్లను తక్షణమే నేరవేర్చాలి**
**-చేవేళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర రెడ్డి**



**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రభుత్వం మొండివైఖరి విడనాడి, ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే నేరవేర్చాలని చేవేళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మూడవ రోజు సమ్మెలో భాగంగా ఖమ్మం బస్ డిపో వద్ద ఆర్టీసీ ఉద్యోగులను కలిసి తన మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నియంత ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను దగా చేసిందని, కార్మికులందరూ కలిసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చారన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నియంతగా వ్యవహరించే తీరు దుర్మార్గమన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వాన్ని ఏనాడో తెలుసు అని, దాదాపు రెండు సార్లు సుదీర్ఘ చర్చలు జరిపి ఇంత వరకు వాటిపై స్పందించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. పొన్నం ప్రభాకర్ తెలంగాణ ఉద్యమంలో పార్లమెంట్‌లో పోరాడిన వీరుడిగా మేము భావిస్తామని అంటువంటి నాయకుడే పోరాటాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నించడం దురదృష్టమన్నారు. అనుభవం లేని కొత్త వ్యక్తులను డ్రైవర్లుగా తీసుకోవడం కారణంగా ఆర్టీసీ ఆస్తి నష్టంతో పాటు తెలంగాణ ప్రజల ప్రాణాలకు నష్టం వాటిల్లుతుందన్నారు. కోలా శంకర్‌గౌడ్‌లాంటి ఘటనలు పునరావృతం కావొద్దని ప్రతి కార్మికుడు ఓపికతో సహనంతో వేచి ఉండాలి తప్ప ఆత్మహత్యయత్నానికి పాల్పడవద్దని ఈ సందర్భంగా ఆయన కార్మికులకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యను పరిష్కరిస్తుందని, తాము ఆశిస్తున్నామని లేని పక్షంలో బిజెపీ పూర్తి స్థాయిలో కార్మికులకు మద్దతు ఇస్తుదనన్నారు. కేంద్రం నుండే ఎలక్ట్రికల్ బస్సులు కార్పోరేట్లకు నేరుగా అందిస్తున్నామనేది అబద్ధమని కేంద్రం నుండి నేరుగా రాష్ట్రం ప్రభుత్వానికి ఇస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే కార్పోరేట్లకు అప్పజెప్పుతుందని, తెలంగాణ రాష్ట్రంలో తప్ప మరి ఏ రాష్ట్రంలో జరగడం లేదని ఆయన తెలియజేశారు. అనంతరం మహిళ కార్మికులకు ప్రత్యేకంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆయనతో పాటు బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ గొంగూర వెంకటేశ్వర్లు తదితరులున్నారు. మూడవ రోజు సమ్మె సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ రిటైర్డుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బారావు, వేణు, ఏఐపికెఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెన వెంకన్న, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు చింతల రమేష్‌లు మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ఛైర్మన్ పిల్లి రమేష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాదె లక్ష్మీనారాయణ, తోట రామాంజనేయులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, పగడాల మల్లేష్, టియూసిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జె రామయ్య, జిల్లా కార్యదర్శి కె శ్రీనివాస్, సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకులు సివై పుల్లయ్య, పిడిఎస్‌యూ జిల్లా నాయకులు జి మస్తాన్, జేఏసీ కన్వీనర్లు బిఎస్ రెడ్డి, ఎన్ నాగయ్య, ఎల్‌ఆర్‌కె రావు, ఎంఆర్ నాథ్, పిట్టల సుధాకర్, జేఏసీ నాయకులు అనిత, జిఎస్ రావు, బేతంపూడి బుచ్చిబాబు, రామలక్ష్మి, సుజాత, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు మాధవరావు, రోషయ్య తదితరులు పాల్గొన్నారు.

## మెగా ఉచిత వైద్య శిబిరం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వెంకటగిరిలోని 9వ వార్డులో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాళ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో జంగాల రాజేశ్వరరావు సేవ్ యువర్‌లివర్ ఫౌండేషన్, సాయిరాం హాస్పిటల్ సంయుక్తంగా శుక్రవారం వైద్య శిబిరాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి మద్దులపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ బైరు హరినాథ్‌బాబు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా శిబిరంలో స్థానిక ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో 9వ వార్డు కౌన్సిలర్ కందుకూరి శేషమ్మ వెంకటనారాయణ, 13వ వార్డు కాంగ్రెస్ నాయకులు సప్పిడి గోవిందరావు, 8వ వార్డు కౌన్సిలర్ సంఘాని సుశీల, సంఘాని వెంకటేష్, గోగుల శ్రీనివాసరావు, బుర్ర రాధాకృష్ణ, బైరు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నంబూరి మధు సేవలు మరువలేనివి

**-డాక్టర్ కాపా మురళీకృష్ణ**




**ప్రజాపక్షం/వైరా :** వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అమరజీవి నంబూరి మధుసూదన్‌రావు రెండో వర్ధంతి సందర్భంగా జిల్లా 320ఈ గవర్నర్ మదన్మోహన్ రేపాల పిలుపు మేరకు ప్రభుత్వ ఆసుపత్రి నందు రోగులకు పండ్లు, బెడ్స్‌ను శుక్రవారం అందించారు. అదేవిధంగా ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ నిరుపేద మహిళలకు రెండు కుట్టుమిషన్‌లు నంబూరు మధు వర్ధంతి సందర్భంగా వైరా మున్సిపల్ కార్యాలయంలో క్లబ్ అధ్యక్షుడు వై.బుచ్చిరామారావు ఆధ్వర్యంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిస్వార్థ సేవాతత్పరుడు అమరజీవి నంబూరు మధుసూదన్‌రావు సేవలు మరువలేనివని ఆయన పేర్కొన్నారు. వారు మన మధ్య లేకపోడం అత్యంత బాధాకరమని కాని వార ఇసేవలు వారి ఆశయాలు నిలిచే ఉంటాయని వారిని ఈ రోజు స్మరించుకొని ఈ రోజు నంబూరి మధుసూదన్‌రావు వర్ధంతి జిల్లాలో ఉన్న క్లబ్‌లన్నీ సేవా కార్యక్రమాలు డయాబెటిస్ చైల్డ్ వుడ్ క్యాన్సర్ అన్నదానం కంటి పరీక్షలు హరితహారం యువ వికాస్ కార్యక్రమాలు చేపట్టాయని ఆయన తెలిపారు. ఆయనతో గడిపిన క్షణాలను లయన్స్‌క్లబ్ సభ్యులు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజన్ కోఆర్డినేటర్ వుంద్రు శ్యామ్ బాబు, జోన్ ఛైర్మన్ చింతోజు నాగేశ్వరరావు, రీజన్ సెక్రటరీ పెనుగొండుపేందర్‌రావు, క్లబ్ సెక్రటరీ చెరుకూరి శ్రీనివాసరావు, కోశాధికారి గద్దె నీరజ, జిల్లా కమిటీ సభ్యురాలు మాదినేని సునీత, క్లబ్ సభ్యులు మిట్టపల్లి రాఘవరావు, గ్రంధి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం




**ప్రజాపక్షం/కల్లూరుః** జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీలలో ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం పంచాయతీ కార్యాలయాలలో పాలకవర్గం తో పాటు గ్రామ ప్రజలు స్థానిక ఉద్యోగులు ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ సర్పంచులు పాలకవర్గం గ్రామంలో జరిగిన అభివృద్ధి జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు గ్రామ సభలలో వివరించారు. విద్య, వైద్య, సిసి రోడ్లు, అంతర్గత రోడ్లు, అంగన్వాడి ,పాఠశాల, అదనపు గదులు, అంతర్గత డ్రైనేజీ, ఎస్ సి సబ్ ప్లాన్ నిధులు, గ్రామపంచాయతీ నూతన భవనాలు చేసిన అభివృద్ధిని చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించారు. చిన్న కోరు కొండిలోని సర్పంచ్ గీతారెడ్డి, పెద్ద కోరుకొండిలో నాగమణి, చెన్నూరులో ఉప సర్పంచ్ నల్లజాల కిషోర్, ముచ్చవరం సర్పంచ్ శీలం కోటేశ్వరి, బత్తులపల్లి గుగులోతు ఉమారాణి, తోపాటు ఉప సర్పంచ్లు గ్రామ కార్యదర్శులు ఆయా గ్రామాల స్థానిక ఉద్యోగులు తోపాటు మండల స్థాయి ఉద్యోగులు పాల్గొన్నారు.

## జనగణన శిక్షణను పరిశీలించిన తహసీల్దార్



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ఎర్రుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రారంభమైన 2027 జనగణన శిక్షణాకార్యక్రమంలో ఎర్రుపాలెం తహశీల్దార్ ఉషాశారద హాజరై మాట్లాడారు. జనగణనను పారదర్శకతతో నిర్వహించాలని అన్నారు. మూడు రోజులు శిక్షణను ఉపయోగించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఎఎస్ఓ జానిమహమ్మద్, ఆర్పిలు నాగరాజు, సతీష్, పిఆర్‌టియు నాయకులు మదన్మోహన్‌రెడ్డి, యుటిఎఫ్ నాయకులు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ




**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని వి.వెంకటాయపాలెం గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లబ్దిదారులకు మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కాపా ఆదినారాయణ, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావులు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లబ్దిదారులకు మంజూరైన రూ.2,98,500 విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. శ్రీరామనేని అన్నపూర్ణ రూ. 45వేలు, శాఖమూడి సుధాకర్ రూ.13,500, బానోత్ బాబు రూ. 18వేలు, చంద్ర రమేష్ రూ. 52,500, సుజాత నర్రా రూ. 24,000, పోతగాని ఉదయ్ రూ.60,000, మూడ్ సైదమ్మ రూ. 19,000, బానోత్ మంగీ రూ.60,000 మొగిలి పాలెపు బ్రహ్మం రూ. 16,500 చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఏఎంసి ఛైర్మన్ మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో ప్రభుత్వ పథకాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ది చేకూరుస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మూడు శంకర్, నాయకులు కిలారు వెంకటరమణ, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు బానోత్ కిషోర్, బోలగాని రామలింగం, పరుచూరి శ్రీను, యడ్లపల్లి నాదం తదితరులు పాల్గొన్నారు.

## బదిలీ బ్యాంక్ అధికారికి సన్మానం



**ప్రజాపక్షం/వైరాః** వైరాలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సోమవరం బ్రాంచ్ నందు గత నాలుగు సంవత్సరాలుగా క్యాషియర్ విధులు నిర్వహిస్తున్న శ్రీను నాయక్ అనే ఉద్యోగి హైదరాబాద్ హెడ్ ఆఫీస్‌కు బదిలీపై వెళుతున్నాడు. గడిచిన నాలుగు సంవత్సరాలు శ్రీను నాయక్ ప్రజలకు బ్యాంక్ ద్వారా అందించిన సేవలను గుర్తించి న్యాయవాది భరత రాకేష్ సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా ప్రజలకు అమితమైన సేవలు అందించాలని తన ఉద్యోగ నిర్వహణలో బాధ్యతగా ఉండాలని, ప్రజలతో మమేకమైనప్పుడు బ్యాంకింగ్ చాలా సులువు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ వేణు, సేవా కేంద్రం నిర్వాహకులు రమేష్, స్నేహ, వెంకటి, చారి, పలువురు వ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

## పంచాయతీ రికార్డుల పరిశీలన



**ప్రజాపక్షం/వైరాః** వైరా మండలం వల్లాపురం గ్రామపంచాయతీలో శుక్రవారం వైరా ఎంపివో రాజేశ్వరి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో రాజేశ్వరి ఎఫ్ఎఫ్‌సి రికార్డులు పరిశీలించి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజాపాలన ప్రగతి కార్యక్రమం పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపివో రాజేశ్వరి మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజలకు త్రాగునీటి సమస్య రాకుండా చూడాలని, పారిశుధ్య సమస్యలు లేకుండా పరిష్కరించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రటరీ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అన్నదానం



**ప్రజాపక్షం/ మధిర :** మధిరలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ప్రతి శుక్రవారం అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భాగంగా దాతలు వేముల చరణ్, మైథిలి, మహంకాళి నికిల్ జ్ఞాపకార్థం మహంకాళి ఉమా శంకర్ వారి కుటుంబసభ్యుల ఆర్థిక సహకారంతో అన్నప్రసాద వితరణ జరిగింది. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన దాత వేముల చరణ్‌కుమార్, మాజీ కౌన్సిలర్ మల్లాది సవిత మాట్లాడుతూ అన్నిదానాల్లో కల్లా అన్నదానం మిన్న అని, అన్నం పరబ్రహ్మ స్వరూపమని, ప్రతి ఒక్కరూ పుట్టిన రోజు, పెళ్లిరోజుల సం దర్భంగా పేదలకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, అన్నదాతలను ప్రోత్సహించాలని కోరారు. దేవాలయంలో ప్రతి శుక్రవారం అన్నదాన కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలను వారు అభినందించారు. ఈకార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## స్మశాన వాటికను సర్వే చేసిన అధికారులు



**ప్రజాపక్షం/ మధిర :** మధిర మున్సిపాలిటీ పరిధిలోని రెండవ వార్డు ఎంప్లాయీస్ కాలనీలోని స్మశానవాటిక అభివృద్ధిలో భాగంగా అధికారులు శుక్రవారం సర్వే చేశారు. ఈ కార్యక్రమంలో మధిర తహశీల్దార్ ఆర్.రాంబాబు, సర్వేయర్ ఉషారాణి, ఆర్ఐ శిరీష, రెండో వార్డు ఆఫీసర్ డేవిడ్, వార్డు కౌన్సిలర్ రమణనాయక్ తదితరులు స్మశాన వాటిక స్థలాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క ఆదేశాల మేరకు స్మశాన వాటిక స్థలాన్ని పరిశీలించటం జరిగిందని తెలిపారు. స్మశాన వాటిక అభివృద్ధిలో భాగంగా సర్వే చేసిన రిపోర్ట్‌ను పై అధికారులను పంపించనున్నట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో రైతులు తేజావత్ బాలునాయక్, శాంతబాబు, ముంగి రాములు, వాటర్ ప్లాంట్ శ్రీనివాస్, మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు లేక రైతుల ఆందోళన



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** ఎర్రగుంట గ్రామంలో ధాన్యం కొనుగోలు చేపట్టకపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బోయినపల్లి సుధాకర్‌రావు ఆధ్వర్యంలో రైతులు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించడంతో వాహన రాకపోకలు గంటల పాటు నిలిచిపోయాయి. గ్రామానికి చెందిన రైతులు ఇటీవల వరి కోత పూర్తి చేసి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాదలకు తరలించినప్పటికీ, అధికారులు వివిధ కారణాలు చూపుతూ కొనుగోలు చేయకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తేమ శాతం ఎక్కువగా ఉందని, గన్నె సంచుల కొరత ఉందని, తూకం యంత్రాల సమస్యలు న్నాయని చెప్పి ధాన్యాన్ని స్వీకరించడం లేదని రైతులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో బిఆర్ఎస్ నేతలు, రైతులు కలిసి రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. రైతులు ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, కనీస మద్దతు ధర హామీ ఇవ్వాలని అంటూ నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు, మండల తహసీల్దార్ స్వర్ణ, జిల్లా సివిల్ సప్లైస్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని నిరసనకారులతో చర్చలు జరిపి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈసందర్భంగా బిఆర్ఎస్ నాయకులు బోయినపల్లి సుధాకర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. కొనుగోలు పేరుతో ధాన్యం లారీలను తీసుకెళ్లి తిరిగి వెనక్కి పంపిస్తున్నారని ఆరోపించారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసిపోతే రైతులకు భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అధికారులు త్వరలోనే కొనుగోలు ప్రారంభిస్తామని హామీ ఇచ్చినా, రైతులు మాత్రం అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈకార్యక్రమంలో మండల బిఆర్ఎస్ నాయకులు కొత్తూరి వెంకటేశ్వర్లు, చల్లా రాంబాబు, పెద్ద లక్ష్మ ణరావు, హరీష్, మోహన్‌రావు, వస్త్రం, రైతులు పాల్గొన్నారు.

## పిండిప్రోలు కళాశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించారు





**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** పిండిప్రోలు కళాశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులు వివిధ రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ గ్రామానికి, కళాశాలకు మంచి పేరు తీసుకువస్తున్నారని గ్రామ సర్పంచ్ కామల్ల సువార్త అన్నారు. పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న పిండిప్రోలు గ్రామానికి చెందిన గోకనపల్లి యామిని అత్యధిక మార్కులు సాధించి గ్రామానికి కళాశాలకు మంచి పేరు తీసుకొచ్చినందున పిండిప్రోలు గ్రామపంచాయతీ ఆధ్వర్యం లో యామినికి గ్రామ సర్పంచ్ కామల్ల సువార్త, ఉపసర్పంచ్ చామకూరి రాజు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. యామిని ని సాల్వతో సత్కరించడం అనంతరం ఈ సందర్భంగా సర్పంచ్ కామల్ల సువార్త మాట్లాడుతూ, ఇటీవల తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో పిండిప్రోలు గ్రామానికి చెందిన గోకినపల్లి యామిని పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూప్ అభ్యసిస్తుంది కష్టపడి చదివి 470 మార్కులకు గాను 467 మార్కులు సాధించి కళాశాల టాపర్గా నిలిచింది పిండిప్రోలు కళాశాల గ్రామస్తుల అందరి కృషితో 1984లో కళాశాలను ఏర్పాటు చేసుకోగా ఈ కళాశాలలో చదివిన విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉన్నత పదవులు సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులు కూడా పట్టుదల, కష్టపడి చదివితే పెద్ద స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ చామకూరి రాజు, సిపిఎం సీనియర్ నాయకులు దొండేటి ఆనందరావు, సిపిఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకులు కమ్మకొమ్మటి నాగేశ్వరరావు, గౌతమి విద్యాసంస్థల అధినేత కాంపాటి బాబురావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిరికొండ రామకృష్ణ, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు పరికిపల్లి చంద్రశేఖర్, వార్డు సభ్యులు పసాలాది ముత్తయ్య గోకినపల్లి బోస్ నవీన్ బిఆర్ఎస్ యూత్ నాయకులు చామకూరి శరత్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## వేసవిలో ప్రజల దాహం తీర్చే చలివేంద్రాలు ఎంతో ఉపయోగకరం



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** వేసవిలో ఉష్ణోగ్రతలు తీవ్రతరం అవుతున్న తరుణంలో ప్రజల దాహం తీర్చేందుకు మేకల తండా గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ నాయకులు గుగులోత్ గణేష్ సతీమణి జ్యోతి దంపతుల ఆధ్వర్యంలో ఖమ్మం వరంగల్ జాతీయ రహదారి వెంబడి మేకల తండా స్టేజీలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని ప్రారంభించడానికి ముఖ్య అతిథులుగా పాలేరు డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, స్థానిక ఎస్సై కూచిపూడి జగదీష్ హాజరయ్యారు. చలివేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయటం ఎంతో అభినందనీయమని వారన్నారు. ఈ చలివేంద్రం బాటసారిలకు వాహనదారులు రైతు కూలీలు విద్యార్థులు ప్రయాణికులకు మంచినీటి ఎంతో ఉపయోగపడుతుందని వారు అన్నారు. గూగులోత్ గణేష్ మంచి స్నేహశీలి ఆపదలో ఉన్నవారికి సహాయ సహకారాలు అందిస్తూ సామాజిక సేవా కార్యక్రమాల్లో గణేష్ ముందు వరుసలో ఉంటాడని గణేష్ ని వారు ప్రశంసించారు. గణేష్ లాంటి వ్యక్తిత్వం ఉన్న మంచి మనిషి నీ ఆదర్శంగా తీసుకొని యువత సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్, జడల నగేష్, మేకల తండా సర్పంచ్ లక్ష్మి, మేడిదపల్లి సర్పంచ్, అనిల్ రెడ్డి, మేకల తండా ఉప సర్పంచ్ వీరు గ్రామ వార్డ్ మెంబర్లు భూక్య బాలకృష్ణ, బోడ వీరన్న, బోడ శారద, బానోత్ భద్రమ్మ, గ్రామ పెద్దలు భూక్య మంగ్యా, బూడియా. హుస్సేన్, హైమావతి, ధరావత్ శక్రు, బోడ సామ్య, బోడ శ్రీను, బోడ రాంబాబు, డిసి శంకర్, అన్వేష్, మోతిలాల్, ఉపేందర్, కాళోజి, బాలాజీ, శంకర్, ఎల్ఐసి శ్రీను, రాజేష్, నాను, బాసు, సాగర్, కోటిరెడ్డి, సురేష్, ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎంఎల్ఏ సుదర్శన్‌రెడ్డి అరెస్ట్

### –కారేపల్లికి తరలింపు




**ప్రజాపక్షం/కారేపల్లి:** నర్సంపేటలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్న నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ మాజీ ఎంఎల్ఏ పెద్ది సుదర్శన్‌రెడ్డిని శుక్రవారం అదుపులోకి తీసుకుని కారేపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో కార్మికుడు శంకర్‌గౌడ్ ఆత్మహత్య ఘటనపై ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతుండటంతో నిరసనలు చెలరేగే అవకాశముందని పోలీసులు భావించినట్లు సమాచారం. పరిస్థితులు అదుపు తప్పకుండా ఉండేందుకు ఈ చర్యలు తీసుకున్నామని అధికారులు తెలిపారు. అయితే ఈ అరెస్టుపై రాజకీయ వర్గాల్లో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక నాయకులు నిరసనలకు మద్దతు ప్రకటించడంతో నర్సంపేట ప్రాంతంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.

## పూర్తిస్థాయిలో అందుబాటులోకి ఆర్టీసీ బస్సులు



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు డిపో పరిధిలో ఆర్టీసీ బస్సులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చాయి. సమ్మె నేపథ్యంలో అధికారులు ప్రత్యామ్నాయంగా ఔట్సోర్సింగ్ సిబ్బందితో సర్వీసులను నడుపుతున్నారు. ప్రభుత్వ ఉచిత ప్రయాణ పథకం యథావిధిగా కొనసాగుతుండటంతో మహిళలు, ఇతర ప్రయాణికులు ఇబ్బంది లేకుండా గమ్య స్థానాలకు చేరుకుంటున్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అధికారులు చర్యలు చేపట్టడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

## గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యం

### -మండల పంచాయితీ అధికారి రవీంద్రప్రసాద్



**ప్రజాపక్షం/కారేపల్లి:** మండలంలోని అన్ని గ్రామ పంచాయితీలు సమగ్ర అభివృద్ధి దిశగా ప్రణాళికాబద్ధంగా పని చేసి ఆదర్శ పంచాయితీలుగా రూపుదిద్దుకోవాలని మండల పంచాయితీ అధికారి మల్లెల రవీంద్రప్రసాద్ సూచించారు. భాగ్యనగర్ తండా గ్రామ పంచాయితీ కార్యాలయంలో నిర్వహించిన జాతీయ పంచాయితీ దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామసభలో మాట్లాడిన ఆయన, మహాత్మాగాంధీ సూచించినట్లు గ్రామాల అభివృద్ధే దేశానికి పునాది అని పేర్కొన్నారు. పంచాయితీల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు కట్టుబడి నిధులు మంజూరు చేస్తున్నాయని, ఆ నిధులను దుబారా చేయకుండా ప్రజలకు ఉపయోగపడేలా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి గ్రామం శ్రేయస్సు కోసం పాలకవర్గాలు సమన్వయంతో పని చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హీరాలాల పంచాయితీ కార్యదర్శి అనిల్ కుమార్, ఉప సర్పంచ్ బిక్కులాల్, వార్డు సభ్యులు గాంధీ, కిషన్, పెద్దలు రాందాస్ నాయక్, రాంచందర్ నాయక్, భీముడు నాయక్, మంగీలాల్ నాయక్, రాంజీ నాయక్, దేవులాల్ నాయక్, పంచాయితీ సిబ్బంది రాందాసస్, నంద, గణేష్, రాధా, చరణ్, పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/గుండాల :** మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఇల్లందు వ్యవసాయ మార్కెట్ చైర్మెన్ రాంబాబు ప్రారంబింపచేశారు.ఈ సందర్బంగా రాంబాబు మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టించి పండించిన జొన్నపంటకు గిట్టుబాటుధరను ప్రభుత్వ మద్ధతు ధర క్వింటాకు 24వందలు అందిస్తుందని అన్నారు. రైతులు ధళారి వ్యాపారుల భారిన పడి మోసపోవద్దని సూచించారు. అలాగే జొన్నపంటను సాగుచేసిన రైతుల వివరాలు స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆన్‌లైన్ చేయబడి ఉండాలని , వ్యవసాయ కార్యాలయంలో ఇచ్చే సాగుపత్రాలతో పాటు ,పట్టాపాస్‌బుక్, ఆధార్, భ్యాంక్ ఎకౌంట్‌బుక్ జిరాక్స్ ప్రతులను రైతులు వెంటతీసుకు రావాలని సూచించారు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు, ఏఓ, ఏఇఓతోపాటు, సర్పంచి సీతారాములు, వివిద పార్టీలనాయకులు, ఎస్కే ఖదీర్, మాజిఎంపిపి ముక్తి సత్యం, ఊకె బాబు, గడ్డం వీరన్న, అబ్దుల్‌నబి, పిఏసిఎస్ సిఇఓ పాష, రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు

## భవిష్యత్ రాజకీయాలు వేదిక కానున్న ప్లీనరీ

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** హైదరాబాద్ లో మే 12 న జరగనున్న తెలంగాణ జన సమితి ప్లీనరీ భవిష్యత్ రాజకీయాలకు వేదిక కానున్నదని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్ రావు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీజేఎస్ 4వ ప్లీనరీ హైదారాబాద్ లో మే 12 న జరుగుతుందని తెలిపారు. ఈ ప్లీనరీ ను జయప్రదం చేయాలని కోరుతూ, గ్రామాలలో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఉద్యమ ఆకాంక్షలను సాధించేందుకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామిక తెలంగాణ ను నిర్మించేందుకు ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని సూచించారు. కేంద్రం రాష్ట్రాల ప్రాభాల్యం ను తగ్గించేందుకు ఆ శాస్త్రీయమైన డీలిమిటేషన్ ను ముందుకు తీసుకొచ్చిందని అన్నారు. కేంద్రం కుట్రల ను తిప్పికొట్టేందుకు సిద్ధం కావాలని సూచించారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే క్షేత్రస్థాయిలో ఉద్యమాలు చేసేందుకు కార్యచరణ ను రూపొందించినట్లు తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో జిల్లా నాయకులు మాదాసు శ్రీనివాసరావు, మండడి వెంకటేశ్వరరావు, తీగ రాములు, పి.ధనమూర్తి, మల్సూర్, ఆంజనేయులు, యాకయ్య, వెంకటేశ్వర్లు, కర్లపూడి కోటయ్య పాల్గొన్నారు.

## నల్లబెల్లం పట్టివేత



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** కోనాయిగూడెం లో బొమ్మిశెట్టి శ్రీనివాస్ అనే వ్యక్తి నల్లబెల్లం తయారీ చేసి గుడుంబా తయారీదారులకు విక్రయిస్తున్నాడని కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. టాస్క్ ఫోర్స్ బృందం, నేలకొండపల్లి సిబ్బంది తో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించారు. మండలం లోని కోనాయిగూడెం లో నల్లబెల్లం అక్రమ రవాణా జరుగుతున్న విషయం ను తెలుసుకున్న ఎక్సైజ్ అధికారులు శుక్రవారం రాత్రి దాడులు చేశారు. గ్రామానికి చెందిన బొమ్మిశెట్టి శ్రీనివాస్ అనే వ్యక్తి తన ఇంట్లో అక్రమంగా నల్లబెల్లం ను తయారు చేసి గుడుంబా తయారీదారులకు విక్రయిస్తున్నట్లు విచారణ లో తెలటంతో అతని పై కేసు నమోదు చేసి 1,944 కిలోల నల్లబెల్లం ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏఈఎస్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడారు. అక్రమ మధ్యం తయారీకి సహకరించే వారి పై, నల్లబెల్లం నిల్వలు, రవాణా మరియు విక్రయాల పై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని పేర్కొన్నారు. చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారి పై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడులలో డీటీఎఫ్ సీఐ కరుణ శ్రీ, నేలకొండపల్లి సీఐ రమేష్. ఎస్సై లత లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# నైపుణ్యాభివృద్ధితో యువతకు ఉపాధి అవకాశాలు : కలెక్టర్



**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** నైపుణ్యాభివృద్ధితో యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని కలెక్టర్ అంకిత్ అన్నారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమానికి హాజరైన ఆయన అభ్యర్థులతో మాట్లాడారు. నవభారత్ ఒకేషనల్ ఇనిస్టిట్యూ ద్వారా వెల్డింగ్, ఎలక్ట్రికల్, ఫిట్టర్, సోలార్ వంటి కోర్సుల్లో ఇప్పటి వరకు 2200 మందికి శిక్షణ ఇవ్వగా ఈ సంవత్సరం 80 మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిగ్రీలతో పాటు వృత్తి నైపుణ్యాలు అవసరమని, వాటితోనే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. వృత్తి విద్య స్వయం ఉపాధికి కూడా దోహదపడుతుందని, యువత ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## జన గణనకు శిక్షణ



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం నుంచి మే నెల పదవ తేదీ వరకు శిక్షణ కార్యక్రమం బృందాల వారీగా జరుగుతుందని శిక్షకులు పోట్రు మధు, సత్యం లు తెలిపారు. భారత జనగణన 2027 తెలంగాణలో జనాభా లెక్కలు మే నెల 10వ తేదీ నుండి ప్రారంభం కానున్న దృశ్య ముందుగా శిక్షణ కార్యక్రమాన్ని బృందాల వారీగా శుక్రవారం తహశీల్దార్ బ్రహ్మేశ్వర రావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం శిక్షకులు దేశంలో అభివృద్ధి చెందాలంటే మన జనాభా ఎంతో తెలియాలి సంక్షేమ పథకాలు వసతుల కల్పన ఇతర కార్యక్రమాలు జనాభా ఆధారంగా రూపు కల్పన తోపాటు అమలు చేయాలంటే ఈ గణాంకాలు ఎంతో అవసరం అని ప్రతి పదేళ్లకోసారి కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జనాభా లెక్కలు సేకరిస్తారు. కోవిడ్ కారణంగా గణన సాధ్యం కాకపోవడంతో ప్రస్తుతం 2021 జనాభా లెక్కలన్నీ ప్రామాణికంగా తీసుకుంటున్నారు. మారుతున్న సాంకేతిక కారణాల పరిజ్ఞానం ఆధారంగా డిజిటల్ విధానంలో వివరాలు నమోదుకు నిర్ణయించిన నేపథ్యంలో జనులే తమ వివరాలను ఆన్లైన్లో నమోదు చేసుకునే అవకాశం కల్పించింది. దేశవ్యాప్తంగా 18 భాషల్లో వివరాలు నమోదు చేసుకున్న అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. కుటుంబాన్ని లేదా కుటుంబ సభ్యుల్లో ఎవరిదైనా ఫోన్ నెంబర్ ఎంటర్ చేయాలి .తర్వాత ఓటిపి వస్తుంది ప్రశ్నావళి నింపేందుకు కావలసిన భాషను ఎంపిక చేసుకోవాలి. ఆ తర్వాత వరుస క్రమంలో ప్రశ్నావళి వస్తుంది. భర్తీ చేస్తూ పోవాలి 34 అంశాలు లో వీటిల్ని సందేహం ఉన్న వాటిని వదిలేసి మిగిలినవి పూర్తి చేయవచ్చు నమోదు ప్రక్రియ పూర్తయిన అనంతరం 11 అంకెల ప్రత్యేక ఐడి వస్తుంది ఇంటికి వచ్చిన ఎన్యుమరేటరుకు ఈ ఐడిని ఇవ్వాలి వివరాల్లో తప్పులుంటే అతని సమక్షంలోనే ఐడీ సాయంతో సరిచేసుకునే అవకాశం ఉంది. ఈ అంశాల పట్ల మే నెల 10వ తేదీ వరకు బృందాలు వారిగా శిక్షణ కార్యక్రమం జరుగుతుందని శిక్షకులు మధు, సత్యం లు వివరించారు. ఈ కార్యక్రమాలలో మండల పరిధిలోని సుమారుగా 200 మంది ఉపాధ్యాయులు ఈ శిక్షణలో పాల్గొంటున్నారు.

# ధాన్యం కొనుగోలు వెంటనే ప్రారంభించాలి

**- సిపిఎం డిమాండ్**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే తక్షణమే కొనుగోలు చేయాలని సిపిఎం సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కొలిగపోగు సర్వేశ్వరరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ, నేటికీ 15 రోజులు గడిచినా మిల్లులు కేటాయించలేదని ఆయన పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు చేయడంలో ఆలస్యం తగదని అన్నారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల వద్దకు ధాన్యం పోసి దాదాపు 20 రోజులు గడిచిందని, గింజలు పూర్తిగా ఎండిపోయి 12 శాతాలకు వచ్చినప్పటికీ అధికారులు చొరవ చూపడం లేదని విమర్శించారు. అధికారులు వెంటనే స్పందించి కొనుగోలు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని కోరారు. రైతులు ఇప్పటికే పంటను కోయడంతో మార్కెట్లో నిల్వ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రభుత్వం ఆలస్యం చేయడం వల్ల రైతులు ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరలకు ధాన్యం అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస మద్దతు ధర (ఎం.ఎస్.పి)కు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

## ఇందిరమ్మ కాలనీ వద్ద కాల్వలకు ఫెన్సింగ్ ఏర్పాటుకు ప్రణాళిక



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 6,9 వార్డుల నందు గల ఇందిరమ్మ కాలనీ ప్రజలకు, చిన్న పిల్లకు ఎన్ఎస్‌పి కాల్వ ప్రక్కన ఉండడంతో ప్రమాదం పొంచి ఉందని గ్రహించిన మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్ల సంతోష్ శుక్రవారం ఇందిరమ్మ కాలనీ వద్ద ఉన్న కాల్వ వద్దకు వెళ్లి ప్రమాదం జరగకుండా ముందస్తుగా గుర్తించి కాల్వకు ఆనుకొని ఫెన్సింగ్ ఏర్పాటు కొరకు ఎస్టిమేషన్ నో మున్సిపల్ చేయి శ్రీమాన్యతో ప్రపోజల్ తయారు చేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్ సెల్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాపా మురళీకృష్ణ, మున్సిపల్ ఏఈ శ్రీమాన్య, సానిటరీ ఇన్స్‌పెక్టర్ గుగులోత్ వీరన్న, తోటకూర వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను సత్వరమే నెరవేర్చాలి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు భాజపా జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ల వీరంరాజు. ఉద్యోగ భద్రతకై ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి, వేతన సవరణ అమలు చేయాలి, కెసిఆర్ రద్దు చేసిన కార్మిక సంఘాల ఏర్పాటుకు అనుమతినివ్వాలి అంటూ న్యాయమైన డిమాండ్లతో ఆర్టీసీ కార్మికులు దీక్ష చేపట్టినప్పటికీ ఎటువంటి చర్యలు ప్రభుత్వపరంగా చేపట్టకపోవడంతో బలన్మరణం చేసుకున్న శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని, ప్రభుత్వ నిరంకుశత్వ వైఖరి వల్ల సత్తుపల్లి ఆర్టీసీ కార్మికులు చేస్తున్న నిరసనకు సత్తుపల్లి పట్టణ అధ్యక్షులు భాణావత్ విజయ్ నేతృత్వంలోని భాజపా బృందం దీక్షా శిబిరానికి వెళ్లి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఖమ్మం భాజపా జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ల వీరంరాజు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు చేస్తున్న న్యాయమైన డిమాండ్ల తక్షణమే పరిష్కరించాలని లేనియెడల ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంలో ఆర్టీసీ కార్మికులు సైతం పాల్గొని విజయవంతం చేసిన సకల జనుల సమ్మె, కార్మికుల పట్ల నిరంకుశం గా వ్యవహరించిన గత ప్రభుత్వానికి ఏ గతి పట్టిందో అదేవిధంగా నిరంకుశ వైఖరిని విడనాడకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం సైతం గద్దె దిగటం ఖాయమని, తక్షణమే సమస్యలను పరిష్కరించాలని, సమస్య పరిష్కారం అయ్యేంతవరకు భాజపా ఆర్టీసీ కార్మికులకు అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా సీనియర్ నాయకులు చీకటి వసంతరావు, ప్రముఖ దంత వైద్యశాల నిపుణులు డాక్టర్ పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

## వేసవి బ్యాడ్మింటన్ శిక్షణను ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ కాపా



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని రింగు రోడ్డు వద్ద ఇండోర్ స్టేడియంలో వేసవి శిక్షణ బ్యాడ్మింటన్‌ను వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ శుక్రవారం మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ చంద్రకళ మాట్లాడుతూ పిల్లలు వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని, క్రీడల్లో కూడా రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ మెడికల్ అండ్ హెల్త్ అధ్యక్షులు కాపా మురళీకృష్ణ,, కోచ్ అంజాత్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## బైక్ దొంగలు అరెస్ట్..



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** మండల కేంద్రం లోని మాలి సురేష్, (తండ్రి పేరు హిరా సింగ్) అను అతను తన యొక్క పల్సర్ ద్విచక్ర వాహనాన్ని రాత్రి 9 గంటల సమయంలో వెంగన్నపాలెంలోని కొత్తగూడెం నుండి ఖమ్మం వెళ్లే ప్రధాన రహదారి పక్కన బండి రామనాథం ఇంటి ఎదురుగా వాహనాన్ని పార్క్ చేసి రాత్రి సమయం కనుక నిద్రించినాడు. మురుసటి రోజు ఉదయం 06 గంటలకు నిద్ర నుండి లేచి చూడగా, తన యొక్క పల్సర్ వాహనం కనబడలేదు. తన పల్సర్ ద్విచక్ర వాహనాన్ని ఎవరో గుర్తు తెలియని దొంగలు అపహరించుకునిపోయినారరని దొంగల ఆచూకీ కనుగొనవలసిందిగా మాలి సురేష్ ఫిర్యాదు ఇవ్వగా జూలూరుపాడు పోలీస్ స్టేషన్ ఎస్.ఐ బాదావత్ రవి కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేసి, బైక్ దొంగతనం చేసిన మామిడాల నీరజ్, (తండ్రి పేరు : రమణ), విన్నీ నవీన్, (తండ్రి పేరు : ఏడుకొండలు), మహమ్మద్ నాసిర్ (తండ్రి పేరు : పాషా) లను శుక్రవారం ఉదయం 11 గంటలకు వాహన తనిఖీలు చేస్తూ వెంగన్నపాలెంలోని చంద్రుగొండ క్రాస్ రోడ్డు వద్ద అరెస్టు చేసి, వారి వద్ద నుండి పంచుల సమక్షంలో పల్సర్ ద్విచక్రవాహనాన్ని స్వాధీన పరుచుకొని, ముగ్గురిని రిమాండ్ నిమిత్తం కొత్తగూడెం కోర్టుకు పంపించారు.

# మండలంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం మెరుగైన సేవలు



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** మండల పరిధిలోని విద్యుత్ అధికారుల కృషి పలు గ్రామాల ప్రజలు ప్రశంసించారు. తిరుమలాయపాలెం మండలంలో అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ అధికారులు మహబూబాద్ జిల్లా మరిపెడ బంగ్లా పరిధిలోని 33 కెవి మరిపెడ వన్ లైన్ ను తిరుమలాయపాలెం స్టెప్ స్టేషన్ కు బ్యాక్ ఫీడింగ్ సప్లై ను అందించేందుకు 6.3 మూడు కిలోమీటర్ల మేర నూతన విద్యుత్ లైన్ ను ఏర్పాటు చేశారు. ఈ లైన్ ఖమ్మం జిల్లా సూపరింటెండింగ్ ఇంజినీర్ ఇనుగుర్తి శ్రీనివాసాచారి, డివిజనల్ ఇంజినీర్ బి.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ. సుమారు రూ. 80 లక్షల వ్యయంతో నిర్మించబడిన ఈ లైన్ పురుషోత్తమైగూడెం నుండి హైదర్ సాయిపేట సబ్ స్టేషన్ నూతన లైను ఏర్పాటు చేయడం ద్వారా మండల పరిధిలోని హైదర్ సాయి పేట పడమటి తండా జోగులపాడు తిప్పారెడ్డిగూడెం అజ్మీర తండా గ్రామాలకు నిరంతర విద్యుత్తు అందించబడుతుందని వారు తెలిపారు. పిండిప్రోలు తిరుమలాయపాలెం పాతర్లపాడు సబ్‌స్టేషన్లు కూడా పరోక్షంగా ఉపయోగపడుతుందని పకృతి విపత్తులు జరిగినప్పుడు లైన్లు మరమ్మతులు చేసే సమయంలో నిరంతర విద్యుత్ అందించేందుకు ఈ లైను ఉపయోగపడుతుందని తద్వారా నాణ్యమైన విద్యుత్ను అందించగలుగుతామని వారు తెలిపారు. నూతన లైను అందించడం ద్వారా మండల పరిధిలోని పలు గ్రామాల ప్రజలు విద్యుత్ అధికారులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఆర్.టి డివిజన్ డివిజనల్ ఇంజినీర్ బద్రూ పవార్, డీఈటీ బాబూరావు, ఏడీఈ కోక్యా నాయక్, ఏఈ శ్రీ నరేందర్ రెడ్డి, సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ కిలారు నాగేశ్వరరావు, మరియు ఫీల్డ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మన జనగణన - మన అభివృద్ధి పోస్టర్ అవిష్కరణ



**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** మన జనగణనమన అభివృద్ధి పోస్టర్‌ను శుక్రవారం కలెక్టర్ అంకిత్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేకరించే జనగణన వివరాలు ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు జనగణన ప్రక్రియ విజయం వంతంగా నిర్వహించాలని సూచించారు. ఇందు కోసం అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జనగణనలో ప్రజలు ఖచ్చితమైన వివరాలు అందించి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఓ సంజీవరావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పాతకక్షలతో వేటకొడవళ్లతో దాడి

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** పాత కక్ష్యలకి తోడు అనుమానంతో ఇద్దరు వ్యక్తుల మధ్య చోటుచేసుకున్న వివాదం వేటకొడవళ్లతో దాడిచేసుకునేంత వరకు దారితీసింది. ఖమ్మం నగరంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వన్‌టౌన్ సిఐ కరుణాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పండితాపురం గ్రామానికి చెందిన భూక్యా ఆనంద్, ఖమ్మం నిజాంపేట ప్రాంతానికి చెందిన రియాజ్ లు బోమ్మన సెంటర్‌లో సెల్ ఫోన్ షాపులో పనిచేస్తున్నారు. వీరి మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఆనంద్ భార్యతో రియాజ్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని అనుమానించాడు. దీంతో గురువారం రాత్రి నిజాంపేటలో నివాసముంటున్న రియాజ్ ఇంటి వద్దకు ఆనంద్ వెళ్లి వివాదానికి దిగాడు. ఇద్దరి మధ్య గొడవ పెరిగి ఘర్షణకు దారితీసింది. ఆనంద్ ముందుగా తనవెంట తెచ్చుకున్న కత్తితో రియాజ్‌పై దాడికి దిగాడు. ఈ క్రమంలో ఆనంద్‌పై రియాజ్ వెటకొడవలితో ఎదురుదాడికి దిగాడు. నడిరోడ్డుపై ఒకరిపై ఒకరు కత్తులతో దాడులు చేసుకోవడంతో ఇరువురికి తీవ్రగ్రాయాలైయ్యాయి. అదే సమయంలో అటుగా వెళ్తున్న ట్రాఫిక్ సిఐ గమనించి స్థానికుల సహాయంతో ఇరువురిని వేర్వేరు ఆసుపత్రుల్లో చికిత్స నిమిత్తం తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.